క్లుప్తంగా

రెగ్యులర్ డీఈఓను నియమించాలి

ములుగు రూరల్ : ములుగుకు రెగ్యులర్ డీఈఓను నియమించాలని ఏఐఎస్ ఎఫ్ జిల్లా కార్యదర్శి కుమ్మరిసాగర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో విద్యారంగ సమస్యలను పట్టించుకోవడంలో ఇన్‌చార్జ్‌లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రెగ్యులర్ డీఈఓను నియమించి పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు.

ఐలమ్మ వర్ధంతి, జయంతిని అధికారికంగా నిర్వహించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రజక సంఘం నాయకులు

కన్నాయిగూడెం : చాకలి ఐలమ్మ వర్ధంతి, జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరుతూ ఆదివారం తెలంగాణ చైతన్య యువజన రజక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు పైడాకుల సమ్మయ్య మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతి , జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలనే జీఓను విడుదల చేశారని అన్నారు. ఆ జీఓ ప్రకారం ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జయరాం, సాయి, తదితరులు ఉన్నారు.

బదిలీపై వెళ్తున్న ఏఎస్సైకి సన్మానం



ఏటూరునాగారం : ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌లో మూడేళ్లుగా ఏఎస్సైగా విధులు నిర్వహిస్తూ బదిలీపై కొత్తగూడేనికి వెళ్తున్న సుబ్బారావును స్థానిక సీఐ శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. అదే విధంగా ఏటూరునాగారం జమా మసీద్ కమిటీ అధ్యక్షుడు అఫ్జల్ పాషా ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పాల్గొని ఘనంగా సన్మానించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ఏ ప్రదేశంలోనైనా విధులు నిర్వహించిన ప్రజలకు సేవ చేయాలని వారి కష్టాలను తీర్చేందుకు నిత్యం ప్రయత్నం చేయాలని సుబ్బారావుకు తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి



ములుగు రూరల్ : విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన మల్లంపల్లి మండలం మంచినీళ్లపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుర్రాల చిన్న సారయ్యకు చెందిన పాడిగేదె మేత మేస్తూ విద్యుత్ స్తంభం వైపు వెళ్లింది. దీంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతిచెందిన గేదె విలువ రూ.లక్ష వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

గ్రహణంతో ఆలయాలు మూసివేత



రామాలయానికి తాళం వేస్తున్న అర్చకుడు

ఏటూరునాగారం : మండలంలోని దేవాలయాలను అర్చకులు ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. అర్ధరాత్రి వరకు సంభవించే సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయాన్ని అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వర్‌రావు శర్మ మూసివేశారు. అలాగే శివాలయాన్ని అర్చకులు రాజ్‌కుమార్, సాయిబాబా దేవాలయం, రామన్నగూడెం శివాలయం, రామాలయం గుడులను ఆయా అర్చకులు తాళాలు వేశారు. మళ్లీ మరుసటి రోజు ఉదయం (సోమవారం ఉదయం 6 గంటలకు) ఆలయాలను శుద్ధి చేసి సుప్రభాత పూజలతో తెరుస్తారు. దీంతో యథావిధిగా ఆలయాల పని తీరు ఉంటుందని అర్చకులు నాగేశ్వర్‌రావుశర్మ తెలిపారు.

ఎక్కడి నీరు అక్కడే..



అంకుషాపూర్-సోమనపల్లి మధ్య నిర్మించిన సీసీ రోడ్డు



వర్షానికి జలమయమైన ఇళ్లు (ఫైల్)

డ్రెయినేజీ లేక స్థానికుల అవస్థలు
- వర్షాలకు జలమయమవుతున్న ఇళ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

టేకుమట్ల : టేకుమట్ల మండల కేంద్రంనుంచి సుబ్బక్కపల్లి వరకు గతేడాది నూతన రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే టేకుమట్ల నుంచి అంకుషాపూర్ వరకు 12 ఫీట్ల బీటీ రోడ్డు, అంకుషాపూర్ నుంచి సోమనపల్లి వరకు 25ఫీట్ల సీసీ రోడ్డును నిర్మించారు. గతంలో అంకుషాపూర్ నుంచి సోమనపల్లి వరకు 12 ఫీట్ల బీటీ రోడ్డు మాత్రమే ఉండేది. బీటీ రోడ్డుకు ఇరువైపులా సైడు కాల్వలు ఉండగా ఆయా గ్రామాల్లోని మురుగు నీరు డ్రెయినేజీల ద్వారా బయటికి వెళ్లిపోయేది. ప్రస్తుతం అంకుషాపూర్ నుంచి సోమనపల్లి వరకు 25 ఫీట్ల సీసీ రోడ్డును నిర్మించడంతో సైడు కాల్వలు పూర్తిగా సీసీ రోడ్డుకింద పూడుకుపోయాయి. దీంతో నూతనంగా సైడు కాల్వలు ఎప్పుడు నిర్మిస్తారోనని రెండు గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. నూతనంగా రోడ్డు వచ్చినందుకు సంతోష పడాలో, డ్రెయినేజీ లేక ఇబ్బంది పడాలో తెలియని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేరుకుపోతున్న మురుగునీరు..

ప్రధాన రహదారికి ఇరువైపులా సైడు కాల్వలు సీసీ రోడ్డు కింద పూడుకు పోవడంతో డ్రెయినేజీ నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పేరుకుపోతున్న డ్రెయినేజీలో దోమలు వ్యాప్తి చెంది ఆయా గ్రామాల ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఓ వైపు దోమల వ్యాప్తి, మరో వైపు డ్రెయినేజీ సమస్యతో సతమతమవుతున్నారు. గ్రామాలకు సర్పంచ్ పదవి కాలం పూర్తి కావడంతో పంచాయతీ కార్యదర్శులకు సమస్యలను విన్నవిస్తే నిధులు లేవని సమాధానం చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

వర్షాలకు జలమయం..

వర్షాకాలం ప్రారంభం నుంచి ఇప్పటివరకు కురిసిన భారీ వర్షాలకు అంకుషాపూర్, సోమనపల్లి గ్రామాల్లో ఇళ్లన్నీ జలమయమయ్యాయి. గతంలో డ్రెయినేజీలు ఉండడంతో వర్షపు నీరు ఎక్కడా నిల్వకుండా వెళ్లేది. ప్రస్తుతం ప్రధాన రోడ్డుకు ఉన్న సైడు కాల్వలు రోడ్డు కిందపోవడంతో వర్షపు నీరు మొత్తం ఇళ్లల్లోనే నిలిచిపోయి నరకయాతన అనుభవిస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రధాన రోడ్డు వెంట సైడు కాల్వలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.డ్రెయినేజీ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు, పాలకులు స్పందించాలని అంకుషాపూర్, సోమనపల్లి వాసులు వేడుకుంటున్నారు.

వర్షం వస్తే భయమేస్తుంది..



రోడ్డు పక్కన సైడు కాల్వలు లేకపోవడంతో వర్షపు నీరు వెళ్లే దారిలేదు. వర్షం వస్తుందంటే మాకు భయమేస్తుంది. అంకుషాపూర్ నుంచి సోమనపల్లి వరకు 25 ఫీట్లతో రోడ్డు వేశారు. కానీ సైడు కాల్వలు నిర్మించలేదు. వర్షపు నీరు సైతం ఎటూ వెళ్లలేక ఎక్కడి నీరు అక్కడే నిలుస్తుంది. ఇంట్లోని వస్తువులు నీటిలో మునిగిపోయి నష్టాన్నే చూసా. ఇప్పటికైనా అధికారులు స్పందించి సైడు కాల్వలు నిర్మించాలి.

– గోస్కుల గట్టయ్య, సోమనపల్లి

వర్గీకరణతోనే ఎస్సీ ఉపకులాల్లో వెలుగులు

- సీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్
- సన్మాన సభను జయప్రదం చేయాలి



సభ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీహెచ్‌పీఎస్ నాయకులు

కాటారం : వర్గీకరణతోనే ఎస్సీ ఉపకులాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం వెలుగులు నింపిందని చిందు హక్కుల పోరాట సమితి (సీహెచ్‌పీఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం రమేశ్, సన్మాన సభ కన్వీనర్ గడ్డం వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్సీ ఉపకులాల ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన ములుగు జిల్లా గిరిజన భవన్‌లో నిర్వహించనున్న కృతజ్ఞత సన్మాన సభను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ మేరకు కాటారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ఆదివారం సన్మాన సభ కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం గడ్డం రమేశ్, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. కొన్నేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించి ఎస్సీ ఉపకులాల్లో వెలుగులు నింపిందని కొనియాడారు. ఎస్సీ ఉప వర్గీకరణకు సహకరించిన రాష్ట్ర మంత్రి సీతక్కను ఎస్సీ ఉపకులాల ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ ద్వారా సన్మానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ ఉప కులాలకు చెందిన వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న ఉత్తములను గుర్తించి మంత్రి చేతుల మీదుగా సన్మానించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఎస్సీ ఉపకులాల ప్రజలు, మేధావులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఐక్యతను చాటి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం తిరుపతి, సభ కో కన్వీనర్లు గడ్డం రమేశ్‌చంద్ర, పున్నంచందర్, యక్షగాన కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం నీలకంఠం, నాయకులు సంజీవ్, కేదారి, ప్రభాకర్, లక్ష్మయ్య, కరుణాకర్, శ్రీనివాస్, ఉపకులాల నాయకులు టేకం రాజయ్య, పర్వతాలు, రమ, రవళి, కర్నె కంటి గోపాల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా రాజన్న



కాటారం : జాతీయ మాలమహానాడు మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కాటారం మండల కేంద్రానికి చెందిన కందుగుల రాజన్న నియమితులయ్యారు. జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ రాజన్నను నియమించినట్లు పేర్కొన్నారు. ఆదివారం మంథని పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ మాలమహానాడు కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బాణయ్య.. రాజన్నకు నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు, నాయకులకు రాజన్న కృతజ్ఞతలు తెలిపారు. మాల సామాజిక వర్గం సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తానని పేర్కొన్నారు. రాజన్న నియామకం పట్ల మాల మహానాడు నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలి

భూపాలపల్లి అర్బన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకుడు కొల్లోజు దిలీప్ అన్నారు. ఆదివారం రాత్రి బీఆర్‌ఎస్‌వీ నాయకులు యూఆర్‌ఎస్‌ను సందర్శించి అక్కడి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు భవనం నిర్మించాలని, అద్దె భవనంలో కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. రాత్రిపూట డ్యూటీ టీచర్ ఉండడం లేదని, నైట్ వాచ్‌మెన్ మాత్రమే ఉంటున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన సంఘటన మరువక ముందే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్, మహేష్, హరీష్, ప్రేమ్‌కుమార్, ప్రశాంత్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సురక్ష సేవాసమితి ఆధ్వర్యంలో వైద్యశిబిరం



పరకాల: సామాజిక సేవ కార్యక్రమాలే లక్ష్యంగా సురక్ష సేవా సమితిని స్థాపించినట్లు ఆ సేవా సమితి అధ్యక్షుడు రాపర్తి సారంగపాణి అన్నారు. పరకాల మండలంలోని కామారెడ్డిపల్లెలో సురక్ష సేవా సమితి ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వరంగల్‌లోని ప్రముఖ ఆస్పత్రి అజరా , లయన్స్ క్లబ్ సహకారంతో 200 మందికి ఉచిత వైద్యపరీక్షలు చేపట్టి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సురక్ష సేవా సమితి కార్యదర్శి సామల ప్రభాకర్, కోశాధికారి ఎక్కటి రాజిరెడ్డి, వైద్యులు రాపర్తి సురేష్, కంది ప్రశాంత్‌రెడ్డి, సమర్ధరెడ్డి, పావనిరెడ్డి, సామల ప్రవీణ్, కోడెల నాగరాజు పాల్గొన్నారు.

ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి

- ఉపాధ్యాయ సంఘాల నాయకుడు కోరం సంతోశ్ కుమార్



మాట్లాడుతున్న సంతోశ్ కుమార్

వెంకటాపురం(కె) : ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్న మండల విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాల నాయకుడు కోరం సంతోశ్ కుమార్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఏటీఏ, ఏటీఎఫ్, ఎస్‌టీయూ, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఈఓ ఉపాధ్యాయ సమస్యలపై కోఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించ కుండా ఉపాధ్యాయుల భాగస్వామ్యం లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారని అన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం ప్రమేయం లేకుండా ఉపాధ్యాయులను డిప్యూటేషన్ చేస్తున్నారని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో ఉపాధ్యాయ సంఘాలతో కోఆర్డినేషన్ లేకుండా ఇష్టారాజ్యంగా ఎంపిక చేశారని ఆరోపించారు. ఎంఆర్‌సీలో కనీస సౌకర్యాలు కల్పించకుండా నిధులు దుర్వినియోగం చేశారని అన్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని అన్నారు. ఎంఈఓపై కలెక్టర్‌కు, డీఈఓకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు బొల్లే శ్రీనివాస్, పసుల సూర్యనారాయణ, లక్ష్మయ్య, భుజంగరావు, నాగరాజు, వీరయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం



మత్తడికి మరమ్మతు చేయిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్ : గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని కమలాపూర్ మాజీ సర్పంచ్ తోట సంతోష్ తెలిపారు. భూపాలపల్లి మండలం కమలాపూర్‌లో ఇటీవల కురిసిన వర్షాలతో ధ్వంసమైన చెరువు కట్ట మత్తడి మరమ్మతు పనులను ఆదివారం చేపట్టారు. రైతులకు సాగునీటికి ఇబ్బంది కలుగకుండా చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కమలాపూర్ రైతుల పక్షాన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు అబ్బనేని అంజయ్య, మాజీ వైస్ ఎంపీపీ సముద్రాల దీపారాణిశ్రీనివాస్, నాయకులు బుర్ర స్వామి, రైతులు సమ్మయ్య, సాంబయ్య పాల్గొన్నారు

నేటి మహాధర్నాకు తరలిరండి



చిట్యాల: పింఛన్‌దారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

- ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఓదేలు

చిట్యాల : దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్లు పెంచి ఇవ్వాలని కలెక్టరేట్ ఎదుట నేడు (సోమవారం) మహాధర్నా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని పింఛన్‌దారులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి మహాధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు నేరేళ్ల ఓదేలు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని చల్లగరిగ, జూకల్, అందుకుతండా, ఒంటిప్పతండా గ్రామాల్లోని పింఛన్‌దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దివ్యాంగులకు రూ.6 వేలు, మిగతా పింఛన్‌దారులకు రూ.4 వేలు పెంచుతామని హామీ ఇచ్చి నేడు కనీసం అమలు చేయడం లేదని తెలిపారు. రాష్ట్రంలోని 50లక్షల మంది పెన్షన్‌దారుల పక్షాన మంద కృష్ణమాదిగ పోరాటానికి శ్రీకారం చుట్టారని అన్నారు. మండల అధ్యక్షుడు దొడ్డి శంకర్, జిల్లా నాయకులు జేరిపోతుల ఓదేలు, ఎండీ మున్నేరు, ఉప్పలయ్య, రాజు, దివాకర్, రాజయ్య, వంశీతో పాటు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేశ్

జయప్రదం చేయాలి

ములుగు రూరల్ : దివ్యాంగుల, వయోవృద్ధుల పింఛన్ పెంపుపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నేడు (సోమవారం) కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ చాతల్ల రమేశ్ అన్నారు. ఆదివారం మండలంలోని మల్లంపల్లి మండలం కొడిశలకుంటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచకుండా కాలయాపన చేస్తుందని అన్నారు. పింఛన్ పెంపు కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, రాజేందర్, ఐలయ్య, మల్లయ్య, ఓదెలు, కొమురయ్య, లింగయ్య, సాంబమ్మ, దేవయ్య పాల్గొన్నారు.

నానో యూరియాతో లాభాలెన్నో..

చీడపీడలు, తెగుళ్ల ఉధృతికి చెక్
- భూమి, గాలి, నీటి కాలుష్యం నివారణ
- సంకట హరణ బీమా పాలసీ వర్తింపు
- ఉపయోగంపై రైతులకు అవగాహన



యామన్‌పల్లిలో నానో యూరియా ఉపయోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ శివకృష్ణ

భూపాలపల్లి రూరల్ : పర్యావరణానికి హాని కలిగించని నానో యూరియా రైతులకు అందుబాటులో ఉంది. సాగులో ప్రతి ఏటాపెరుగుతున్న ఖర్చులు, ప్రతికూల పరిస్థితులు, చీడ పీడలు, తెగుళ్ల కారణంగా తగ్గిపోతున్న పంటల దిగుబడితో రైతులు సతమతమవుతున్నారు. రైతులకు సంజీవనిలా నానో యూరియా, డీఏపీలు ఇటీవల మార్కెట్లోకి వచ్చింది. నానో యూరియా వినియోగంతో నేల, గాలి, నీటి కాలుష్యం, పంటల్లో చీడపీడలు, తెగుళ్ల ఉధృతిని తగ్గిస్తుంది. నానో యూరియాను నిల్వ, రవాణా చేయడం సులభతరం. రైతుల పంటలు సంకట హరణ బీమా పాలసీ పరిధిలోకి వస్తాయి. ఏదైనా విపత్కర పరిస్థితుల్లో పంట నష్టపోతే రైతులకు బీమా ద్వారా లబ్ధిపొందే అవకాశం ఉంది. ఇటీవలనే వినియోగంలోకి వచ్చిన నానో యూరియా ప్లస్‌ను వరి, పత్తి, మొక్కజొన్న, జొన్న, చెరుకు, పప్పు దినుసులు, కూరగాయలు వంటి వివిధ రకాల పంటల్లో వాడొచ్చు. లాభాలు, ప్రయోజనాలు దిగుబడి ఖర్చుల ఆదా, కాలుష్య నివారణపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రయోజనాలు..
- నానోయూరియా అన్ని పంటలకు నత్రజనిని సమర్థవంతంగా అందిస్తుంది.
- దీని పిచికారీ వల్ల ఎక్కువ పత్ర హరితం, మెరుగైన కిరణజన్య సంయోగ క్రియ సామర్థ్యంతో పంట దిగుబడి పెరుగుతుంది.
- అనుకూలమైన పరిస్థితుల్లో పోషక వినియోగ సామర్థ్యం కంటే ఎక్కువగా ఉంటుంది
- యూరియా బస్తా కంటే నానో యూరియా తక్కువ ధరకు దొరుకుతుంది.

అవగాహన..
- నానో యూరియా పిచికారీ విధానం, ఏ పంటపై ఏ దశలో పిచికారీ చేయాలి, రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రపరిచే విధానం, లాభాలపై వ్యవసాయ అధికారులు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

నానో ఎరువులు..

నానో బయో టెక్నాలజీతో భారత రైతుల సహకార ఎరువుల సంస్థ ఇఫ్కో ద్రవ రూపంలో నానో యూరియా, నానో డీఏపీలను ఉత్పత్తి చేసి రైతులకు అందుబాటులోకి తెచ్చింది. ఈ ఎరువుల ద్రావణాన్ని పిచికారీ చేసినప్పుడు.. మొక్కలు ఆకులలోని పత్ర రంధ్రాల ద్వారా పోషకాలను గ్రహించి వాటి ఎదుగుదలకు ఉపయోగించుకుంటాయి. అరలీటరు నానో యూరియా, నానో డీఏపీ ఒక బస్తా యూరియా, డీఏపీలకు సమానమని ఇఫ్కో చెబుతోంది.

ధర తక్కువ..

నానో ఎరువులు సాధారణ ఎరువుల కంటే ధర తక్కువే. నానో యూరియా అరలీటరు రూ.225కు, నానో డీఏపీ అరలీటరు రూ.600లకే లభిస్తుంది. అదే ఒక యూరియా బస్తా సబ్సిడీ తర్వాత ధర రూ.267కు, డీఏపీ బస్తా రూ.1,350గా ఉంది. ఎరువులను పోషకాల వినియోగంలో కూడా 80 నుంచి 90 శాతం వరకు పంటలు గ్రహించుకుంటాయి.నానో ఎరువుల వాడకంతో దిగుబడులు 8శాతం పెరిగినట్లు పరిశోధనలో వెల్లడైనట్లు అధికారులు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..

గ్రామాల వారిగా రైతులకు నానో యూరియా ఉపయోగాలపై అవగాహన కల్పిస్తున్నాం. యూరియా కొరత ఉన్న సందర్భంగా రైతులు నానో యూరియాను వినియోగించుకోవాలి. నానో యూరియా, డీఏపీ వల్ల రైతులకు ఖర్చు తగ్గుతుంది. రవాణా ఖర్చు ఆదా అవుతోంది. పంటల దిగుబడి పెరుగుతుంది.

– బాబురావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

- ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి

మంగపేట : కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం మండల కమిటీని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మద్దాలి నాగమణి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శానం నిర్మల, ప్రధాన కార్యదర్శిగా చింత చంద్రావతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి హాజరై మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికై న మండల అధ్యక్ష, కార్యదర్శులు పార్టీని గ్రామ గ్రామాన బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. అదే విధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు కట్కూరి రాధిక, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు గీకురు భాగ్య, పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, శెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, వైకుంఠం, యర్రంగారి సురేష్, చింతా పున్నారావు, పెద్ది నర్సింహారావు, కొమరం బాలయ్య, సారయ్య, చౌళం వెంకటేశ్వర్లు, ఎడ్ల నరేష్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్లు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

పరకాల: పోటీ ప్రపంచంలో నూతన సాంకేతికతను ఫొటోగ్రాఫర్లు అందిపుచ్చుకోవాలని పరకాల ఎస్సై విఠల్ అన్నారు. ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో ను ఫొటో గ్రాఫర్స్ విజయవంతం చేయాలని ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బాడి రవీందర్‌రెడ్డి కోరారు. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించే ఎక్స్‌పో బ్రోచర్‌ను పరకాల అమరథామంలో ఆదివారం ఎస్సై విఠల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫొటోగ్రఫీ రంగం నిరంతరం అభివృద్ధి చెందుతూ నూతన సాంకేతికతతో ముందుకెళ్తుందన్నారు. లైటింగ్ పరికరాలు, ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్స్, ప్రింటింగ్ టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫొటో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బాడి రవీందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు చందర్, రూరల్ అధ్యక్షుడు కనుకుంట్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శి బండారి గిరిప్రసాద్, రమేష్, ఉపాధ్యక్షుడు కనుకుంట్ల రాజు, సుదీర్, కోశాధికారి గూడెల్లి శివకుమార్, సుధాకర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి : 9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291